# న్యాయాన్యాయాలు

కావటానికి శివయ్య నా మిత్రుడు. అతనితో ఎప్పుడు పరిచయం కలిగిందో, ఎలాకలిగిందో, ఎక్కడకలిగిందో కూడా నేను చెప్పలేను. కాని ఆ ఘడియమాత్రం అమోఘమైనదనే నమ్మకం నాకున్నది. శివయ్య వస్తుతః మంచివాడు. మాంచి తెలివితేటలు కలవాడు. ఒక్క సంవత్సరమూ ఒక్క క్లాసన్నా తప్పకుండా స్కూలుఫైనలుదాకా చదివేడు. వాడి తండ్రి ఏమాత్రము ఆస్థిపరుడైనా శివయ్యను పై చదువులకు పంపించి వుండేవాడు దురదృష్టవశాత్తు శివయ్య తండ్రి ఆగర్భదరిద్రుడు. ఆ ముసలయ్య చిన్నతనంలో ఏమి సుఖపడ్డాడో అంతే మరి. పెళ్ళిచేసుకున్నాడు. నలుగురు సంతానాన్ని కన్నాడు. యిద్దరు దాటిపోయినా మిగతా యిద్దరి పోషణ భారము అతన్ని గొంతుమేర కృంగదీస్తోంది. ఆయన యీ నాటికీ యాయవారము ఎత్తక తప్పలేదు. పుణ్య పాపాల మీద, దాన ధర్మాల మీద అట్టే నమ్మకంలేని ఈ రోజుల్లో యాయవారమ్మీద పొట్టలు నింపుకో జూడడం సాహసమే మరి. అయినా శివయ్య తండ్రి ఆ సాహసం చేయక తప్పింది కాదు. మొన్న మొన్నటి వరకు అతను శివయ్యమీద గంపెడంత ఆశ పెట్టుకున్నాడు. కొడుకు పెరిగి పెద్దవాడయినాడని యింత చదువు వంటబట్టిందని ఆయన ఎంతో సంతోషించేడు. అయితే ఆ సంతోషాన్ని ఎక్కువకాలం అనుభవించే అదృష్టం అతనికి లేదు కొడుకును పెద్ద చదువులు చదివించాలని ముస

లయ్య చాలా బాధలుపడ్డాడు. అడగరానివాళ్ళను అడిగేడు. చేయరాని పనులు చేసేడు. తను చేస్తున్నది తప్పుఅని తెలిసి నప్పటికీ ఆ తప్పు చేయడం తప్ప మరోమార్గమేదీ శివయ్య తండ్రికి తెల్సింది కాదు. పై చదువుల్ని కట్టిపెట్టి ఉద్యోగాన్వేషణ చేయమని తండ్రి శాసించాడు. శివయ్య అంగీకరించక తప్పలేదు. అయితే అనుకున్నంత సులభంగా శివయ్యకు ఉద్యోగం రాలేదు. అతను చేసిన బ్రహ్మాండమైన ప్రయత్నాలన్నీ గుడ్డిగవ్వకు కొరగాకుండాపోయినవి.

అయినా శివయ్య తన పట్టుదల వీడలేదు. గత నాలుగేళ్ళనుండీ సమధికోత్సాహంతో కృషిచేస్తూనే ఉన్నాడు. అతని కృషి వృథా కాలేదు. కొన్ని చిల్లర ఉద్యోగా లేవో దొరికాయి. విసుగెత్తిపోయిన శివయ్య ఆ ఉద్యోగాల్లో చేరిపోదామనుకున్నాడు. శివయ్య తండ్రి పడనివ్వలేదు. అతనికి కొడుకుమీద అపారమైన విశ్వాసమున్నది. ఆ విశ్వాసబలం శివయ్యచేత చిన్నచిన్న ఉద్యోగాలు చేయనివ్వలేదు.

ఇదొకరకమైన మూర్ఖం. అందిన ఉద్యోగాలు శివయ్య తండ్రికి నచ్చలేదు. ఆయనగారికి నచ్చినవి శివయ్యకు లభ్యపడలేదు. ఈ గుడుగుడుగుంచంతో మరి కొంతకాలం గడిచిపోయింది. ఈ లోపుగా చెప్పుకోదగ్గ పరిణామాలు చాలా జరిగాయి. శివయ్య కుటుంబం ఆర్థికంగా చావుదెబ్బ తిన్నది. కేవలం పొట్టగడవడం కోసరం వాళ్ళు నానా ఇబ్బందులూ పడ్డారు. ఆ సందర్భంలోనే శివయ్య నా దగ్గర కొచ్చాడు. అతన్ని చూడగానే, నా కనిపించింది, అతను నన్నేదో అడగ

డానికొచ్చాడని శివయ్యలాటివాళ్ళకు నాకు చేతనైన సాయం చెయ్యడానికి నా కెటువంటి అభ్యంతరమూ లేదు.

"చాలా ఇబ్బందిపడుతున్నాంరా!" అన్నాడు శివయ్య. "నీ ఎరికన ఎక్కడైనా ఉద్యోగముంటే—ఎలాంటి దైనా సరే చూపిపెట్టు చేస్తాను. పస్తులుండ లేక నానా హైరాను పడుతున్నాను.

"అలాగే" అన్నాను నేను

"అలాగే అంటేకాదు. ఎంతతొందరగాచూస్తే అంత మంచిది. ఉత్తచేతుల్తో కొంప కెళ్ళాలంటే భయమేస్తున్నది. మరీ నాలుగు రోజులనుండీ పొయ్యిరాజటంలేదు." చెప్ప లేక చెప్పలేక చెప్పాడు శివయ్య.

నిశ్శబ్దంగా జేబులోంచి ఐదు రూపాయలకాగితం తీసి శివయ్య చేతిలో పెట్టాను. మానవుడు! కళ్ళు తడిచేసు కొన్నాడు అలాంటి నోటు చూసి ఎంత కాలమయిందో, ఎలాంటి అగచాట్లు పడకపోతే అలా యిదయిపోతాడూ?

సాయంత్రం శివయ్య నా దగ్గర కొచ్చేలోపుగా నాకు తెలిసిన కంపెనీలకు, షాపులకు ఫోనుచేసి కనుక్కున్నాను. అదృష్టమే; ఒకకంపెనీలో ఒక గుమాస్తా సీటు ఖాళీగా ఉన్నదని తెలిసింది. ఆ సంగతి శివయ్యతో చెప్పి ఇలా అన్నాను.

"అబ్బీ! నీ తెలివితేటలకు సరిపడ్డ ఉద్యోగం కాదిది. నిజంగా నువ్వీపని చేయడం నా కేమాత్రం ఇష్టంలేదు. నన్ను క్షమించు. ఇంతకంటె మంచి ఉద్యోగం నే నిప్పించలేక పోయాను. నీకు అభ్యంతరం లేకపోతే వెంటనే వెళ్ళి ఇందులో

ప్రవేశించు. ఇంతకంటె మంచిది దొరికిన రోజున నిరాక్షేప ణీయంగా దీన్ని వదిలిపెట్టు. నేనేమీ అనుకోను'' అన్నాను.

శివయ్య కొన్ని క్షణాలు మాట్లాడలేదు. ముఖమంతా విప్పారుసేలా నవ్వి ''థాంక్స్'' అన్నాడు.

రెండు రోజులదాకా శివయ్య నాకు కనుపించలేదు. మూడోనాడు బేడకాసంత ముఖం చేసుకుని దగ్గరకొచ్చాడు.

''ఏమిటి'' అన్నాను.

''ఆ ఉద్యోగం ఊరికే వచ్చేట్టులేదు. నాకు పోటీగా మరొకడు తగిలాడు రెండొందలు లంచమివ్వందే లాభం లేదు. అవతలవాడు అంత ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. మనం గూడా అదే మొత్తమన్నా ఇవ్వందే మన కీసీటురాదు. అంత డబ్బే నాదగ్గరుంటే ఇలాపస్తులుచేయాల్సిన గ్రహచారమేం!''

ఆపైన శివయ్య మౌనం వహించాడు. నేను వందకాగి తాలు రెండు శివయ్యకిచ్చి 'దీన్ని దానంగా అనుకోకు. నెలలవారీగా నీయిష్టమొచ్చినంతకాలంలో తీర్చుకో' అన్నాను.

కేవలం ఉపకారదృష్టితో చేసిన ఈపని ఇంతగా కొంప ముంచుతుందని నేననుకోలేదు. శివయ్యను అరెస్టు చేశారు. లంచమిచ్చిన నేరానికిగాను ఆపని జరిగింది. శివయ్య పొర పాటున సి.ఐ.డి. దగ్గరుండగానే, మేనేజరుకు డబ్బిచ్చాట్ట. అరెస్టయ్యాడు. నేనే జామీనిచ్చి విడుదల చేయించాను. 2 నెలలపాటు వాయిదాలు పడ్డాయి. చేసిన అపరాధానికి పరిహారంగా ప్లీడరు ఖర్చులు నేనే భరించాను. బ్రహ్మాండ

మైన పలుకుబడి వినియోగిస్తేనే కానీ, జరిమానాతో కేసు కొట్టెయ్యలేదు.

జరిమానా డబ్బు కోర్టులో చెల్లించాను. గుమస్తా లెక్కేట్టుకుని చిత్రంగా నావైపు చూశాడు.

'ఏమిటి?' అన్నాను.

'తమకు తెలియదాండి?'

'నిజంగా నాకు తెలీదు'

'మామూలు' అని మూలిగాడు కోర్టు గుమాస్తా.

నేనివ్వదలచలేదు. ఆసంగతే స్పష్టంగా చెప్పాను.

'మీదయ' అన్నాడు గుమాస్తా.

రశీదుకోసం అటూఇటూ తిరిగాడు. అవీ ఇవీ వెదికాడు. నాకు చిరాకెత్తిపోతోంది.

'అలా తొందరపడితే పన్లుకావండి. మీకంటె ముందొచ్చిన వారున్నారు. వారి పన్లు కానిదే మీపని మట్టుగోనండి నాకు మాటొస్తుంది.' అన్నాడు గుమాస్తా.

గంటలకు గంటలు గడిచిపోతున్నాయి. నాకా రశీదు రాలేదు. సాయంత్రం కాబోతోంది. గుమాస్తా అన్నిటికీ తాళాలు వేస్తున్నాడు.

'నారశీదో?' అన్నాను చిరాగ్గా.

'రేపు రండి! టైమయింది.'

ఫ్యూనువచ్చి 'బాబూ! ఎందుకండి తగూలాట. ఆరి మామూలు ఆరికిచ్చివేయండి. రసీదు పుచ్చుకెళ్ళండి.'

అన్నాడు. అయిదురూపాయలు పుచ్చుకుని రశీదుయిచ్చాడు గుమాస్తా.

చిత్రమేమిటంటే లంచమిచ్చినందుకు శిక్షించే న్యాయస్థానంలో లంచమివ్వందే కాయితాలు బైటికిరావడం లేదు. ఈ ఘోరాలు ఎందుకు జరుగుతున్నాయో. నాకిప్పటికీ అర్థం కావడంలేదు.

---